క్లుప్తంగా

కుష్టుపై అవగాహన


కుష్టుపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

గుత్తి: పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిలో గురువారం డీపీఎంఓ వెంకటేశ్వర్లు, మెడికల్ ఆఫీసర్ విష్ణుమూర్తి ఆధ్వర్యంలో కుష్టుపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు కుష్టు నివారణ చర్యలను తెలియజేశారు. కుష్టు నిర్మూలనకు అందరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు లాజరస్, అమృత లత, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

నేడు 'ప్రజావేదిక'

గార్లదిన్నె: మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం 16వ విడత సామాజిక తనిఖీ ప్రజా వేదిక(బహిరంగ సభ) ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ విజయభాస్కర్ తెలిపారు. తనిఖీ బృందం సభ్యులు నివేదికను చదివి వినిపిస్తారని, ప్రజాప్రతినిధులు, ఉపాధి కూలీలు పాల్గొనాలని కోరారు.

మహిళకు తీవ్ర గాయాలు


తీవ్రంగా గాయపడిన లక్ష్మి

గుత్తి: గుత్తి ఆర్‌ఎస్‌లోని ఫ్లై ఓవర్ బ్రిడ్జి వద్ద గురువారం బైక్‌పై నుంచి పడి ఓ మహిళకు తీవ్రగాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే.. పత్తికొండకు చెందిన లక్ష్మి తన భర్తతో కలిసి తాడిపత్రికి బైక్‌పై బయలుదేరారు. గుత్తి ఆర్‌ఎస్ ఫ్లై ఓవర్ బ్రిడ్జి వద్ద బైక్ అదుపు తప్పి బోల్తా పడింది. ప్రమాదంలో లక్ష్మి తీవ్రంగా గాయపడింది. స్థానికులు ఆమెను గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం వైద్యులు అనంతపురం రెఫర్ చేశారు. పోలీసులు ఘటనపై దర్యాప్తు చేపట్టారు.

దివ్యాంగుల చట్టాన్ని అమలు చేయాలి

గార్లదిన్నె: ప్రభుత్వం 2016 వికలాంగుల చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని దివ్యాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా కళా మండలి అధ్యక్షుడు పుల్లన్న పేర్కొన్నారు. గురువారం వీహెచ్‌పీఎస్ నాయకులు విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం దివ్యాంగుల బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలన్నారు. శారీరక దివ్యాంగులకు రోస్టర్ పాయింట్ టాప్ టెన్‌లోకి తీసుకురావాలన్నారు. చట్టసభల్లో 4 శాతం రాజకీయ రిజర్వేషన్ కల్పించాలన్నారు. దివ్యాంగుల సమస్యలపై శుక్రవారం కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. వీహెచ్‌పీఎస్ జిల్లా కార్యదర్శి రంగనాథ్, మండలాధ్యక్షుడు నాగభూషణం పాల్గొన్నారు.

సమస్యలు తెలుసుకుని పరిష్కరిద్దాం


మాట్లాడుతున్న తహసీల్దార్ షర్మిల

పెద్దపప్పూరు: మండల వ్యాప్తంగా ప్రజా సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరిద్దామని తహసీల్దార్ షర్మిల, జెడ్పీటీసీ సభ్యురాలు రమాదేవి, ఎంపీపీ రామ్మూర్తిరెడ్డి అధికారులకు సూచించారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు అర్హులందరికీ అందేలా చూడాలన్నారు. ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి నిర్వహించిన ప్రజా సంక్షేమయాత్రలో ఎన్నో సమస్యలకు పరిష్కారం చూపారన్నారు. అనంతరం అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. డాక్టర్. కల్యాణ్‌కుమార్, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి ప్రత్యేక చర్యలు


భూమి పూజ చేస్తున్న జెడ్పీటీసీ భాస్కర్

బుక్కరాయసముద్రం: విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని జెడ్పీటీసీ భాస్కర్ పేర్కొన్నారు. గురువారం స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో డైనింగ్ హాల్ నిర్మాణానికి శంకు స్థాపన చేశారు. ముందుగా పాఠశాలలో గదులను, పరసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ పేద విద్యార్థులను ఉన్నత చదువులు చదివించేందుకు సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ఏపీ ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరి సాంబశివారెడ్డి సూచనల మేరకు జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ సహకారంతో జిల్లా పరిషత్ నిధులతో డైనింగ్ హాలు నిర్మాణం చేపడుతున్నామన్నారు. ఉపాధ్యాయులు, జేఈ భాస్కర్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాజు, పూర్వ విద్యార్థులు ప్రతీష్, ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

జగనన్నను మరోసారి ఆశీర్వదించండి


వైఎస్సార్ హెల్త్ క్లినిక్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ


సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ

యల్లనూరు: సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా రాష్ట్రాన్ని ప్రగతిపథం పయనింపజేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా మరోసారి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి ప్రజలను కోరారు. గురువారం తిమ్మంపల్లిలో రైతుభరోసా కేంద్రం, గొడ్డుమర్రిలో సచివాలయం, రైతుభరోసా కేంద్రం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ను ఎమ్మెల్యే జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, రాష్ట్ర ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు ఈశ్వరరెడ్డి, సర్పంచు నాగరాజుతో కలిసి ప్రారంభించారు. వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లో వైద్యురాలు సాయినాగశ్రీ ఎమ్మెల్యేతో కేక్ కట్ చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, జడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మలు మాట్లాడుతూ గ్రామ సచివాలయాలు, ఆర్బీకేలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల ద్వారా గ్రామాల్లోనే అన్ని రకాల ప్రభుత్వసేవలు అందుతున్నాయన్నారు. జగనన్న సీఎం అయ్యాక రాష్ట్రంలో పలు రకాల పెద్ద పెద్ద కంపెనీలు వచ్చాయని, పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు జరిగాయన్నారు. అనంతరం గొడ్డుమర్రి గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ తిరిగి ఆయా కుటుంబాలకు నాలుగేళ్లలో చేకూరిన లబ్ధిని వివరించారు. వచ్చే ఎన్నికల్లో 175 సీట్లకు 175 సీట్లు వచ్చేలా ప్రతి కార్యకర్త, నాయకులు కష్టపడాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ భోగతి విజయ ప్రతాప్ రెడ్డి, నాయకులు కల్లూరు ప్రతాప్‌రెడ్డి, పురుషోత్తం నాయుడు, నాగరంగయ్య, రమణ, రామాంజినేయులు, రామాంజులరెడ్డి, పంచాయతీరాజ్ డి.ఈ. భాస్కర్‌రెడ్డి, తహసీల్దారు రమాదేవి, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ కొండన్న, పంచాయతీరాజ్ ఏఈ నరేంద్ర, విద్యుత్ ఏఈ పద్మనాభరెడ్డి పాల్గొన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా తాడిపత్రి డీఎస్పీ గంగయ్య, సీఐలు వేణుగోపాల్, శంకర్‌రెడ్డి, యల్లనూరు, పుట్లూరు ఎస్ఐలు రామకృష్ణ, వెంకటప్రసాద్, ఏఎస్ఐ సంపత్ బందోబస్తు చేపట్టారు.

కౌలుదారులకే రాయితీలు అందించాలి

శింగనమల: దేవదాయ భూములు కంప్యూటర్ అడంగల్‌లో చేర్చుకున్న వారి పేర్లు తొలగించి అసలైన కౌలుదారులకు ప్రభుత్వ రాయితీలు అందించాలని వైఎస్సార్‌సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షులు ఎన్వీనారాయణ పేర్కొన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సీ బండమీదపల్లిలో గోని మడుగుల వెంకటరమణస్వామి ఆలయ భూములను సర్వే నంబర్ 367లోని 11 ఎకరాల 16 సెంట్లు భూమిని, అదే గ్రామానికి చెందిన ఐదుగురు వ్యక్తులు తమ పేరిట కంప్యూటర్ అడంగల్‌లో చేర్చుకుని ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీలను అనుభవిస్తున్నారన్నారు. నాలుగేళ్ల నుంచి బండమీదపల్లికి చెందిన వెంకటరమణయాదవ్ దేవదాయశాఖకు గుత్త చెల్లించి భూమి సాగు చేస్తున్నారని, అయితే ప్రభుత్వం నుంచి ఎలాంటి రాయితీలు పొందడంలేదన్నారు. రెవెన్యూ అధికారులు స్పందించి కంప్యూటర్ అడంగల్ నుంచి వారి పేర్లు తొలగించాలన్నారు.

లక్ష్మీనరసింహస్వామి ఆలయ నిర్మాణానికి భూమిపూజ


ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఆలూరు సాంబశివారెడ్డి

నార్పల: దుర్గం గ్రామంలో వెలసిన అహోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయ నిర్మాణానికి ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి గురువారం భూమి పూజ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దుర్గం గ్రామంలో వెలసిన పురాతన నాలయమైన లక్ష్మీనరసింహస్వామికి ఎంతో ప్రత్యేకత ఉందన్నారు. అలాంటి ఆలయ నిర్మాణం చేపట్టడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో సర్పంచు రామాంజినేయులు, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చామలూరు రాజగోపాల్, మాజీ మంత్రి సాకే శైలజనాథ్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మిద్దె కుళ్లాయప్ప తదితరులు పాల్గొన్నారు.

నేడు పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ

యాడికి: నగరూరు గ్రామంలో సర్వే నం: 505ఎ, 505బిలో డోలమైట్, స్టీటైట్ మైన్స్ ఏర్పాటుకు సంబంధించి శుక్రవారం ప్రతిపాదిత స్థలం వద్ద డీఆర్ఓ గాయత్రీదేవి ఆధ్వర్యంలో ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహశీల్దార్ అలెగ్జాండర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో ప్రజలు పాల్గొని తమ అభిప్రాయాలను తెలియజేయాలని సూచించారు.

వాల్మీకి ఆలయానికి ఎమ్మెల్యే రూ.లక్ష విరాళం


చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే వైవీఆర్

గుంతకల్లు: కసాపురం గ్రామంలో తలపెట్టిన వాల్మీకి ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి రూ.లక్ష విరాళంగా అందజేశారు. గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రూ. లక్ష చెక్కును కసాపురం గ్రామ వాల్మీకీ కులస్తులకు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2019 ఎన్నికల్లో వాల్మీకి ఆలయానికి ఆర్థికసాయం చేస్తానని మాట ఇచ్చారని, నేడు ఇచ్చిన మాట ప్రకారం సాయం చేయడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో గ్రామానికి వాల్మీకి సంఘం నాయకులు గంతుల రామాంజినేయులు, లక్ష్మన్న, మాజీ ఎంపీటీసీ వెంకటరాముడు, హనుమన్న, అగ్ని రామాంజినేయులు, శ్రీరాములు, భాస్కర్, ఆంజి, మల్లికార్జున, కిసాన్ సెల్ జిల్లా కార్యదర్శి సోమిరెడ్డి, మాజీ సర్పంచ్ తిక్కస్వామి పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న ఎంపీపీ విశాలాక్షి

గుత్తి రూరల్: మండలవ్యాప్తంగా ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజా ప్రతినిధులు, అధికారులు కృషి చేయాలని ఎంపీపీ గాండ్లపాటి విశాలాక్షి పేర్కొన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ చిట్రా శ్రీనివాసులు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మూడు నెలలలో అన్ని శాఖల్లో జరిగిన ప్రగతితోపాటు ప్రతిపాదనలను అధికారులు వివరించారు. ఖరీఫ్ వేరుశనగ విత్తన పంపిణీకి సంబంధించి 13 ఆర్బీకేల్లో ఈ నెల 15 నుంచి రిజిస్ట్రేషన్లు ప్రారంభిస్తున్నట్లు ఏఓ ముస్తాక్ అహ్మద్ తెలిపారు. రోజూ తొమ్మిది గంటల ఉచిత విద్యుత్‌ను కోతలు లేకుండా సరఫరా చేయాలని అధికారులను సర్పంచ్ వెంకటేష్ కోరారు. సర్వసభ్య సమావేశంలో చర్చకు వచ్చిన సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని ఎంపీపీ ఆదేశించారు. తహసీల్దార్ మహబూబ్ బాషా, వైస్ ఎంపీపీలు తిరుపాలమ్మ, నాగేశ్వరమ్మ, సర్పంచ్‌లు చిదంబరి, సుశీలమ్మ, అప్పా వెంకటేష్, రమేష్, వాసుదేవరెడ్డి, చిన్న ఆంజనేయులు, చంద్ర, ఎంపీటీసీలు వీరన్న, సుమలత, శంకరమ్మ, ఈఓఆర్డీ శివాజీరెడ్డి, మండల ఏఈ దివ్యప్రకాష్, హెచ్ఓ మిత్రవింద మాధవి, కార్యదర్శులు సాదిక్, ధనలక్ష్మి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగేశ్వరి పాల్గొన్నారు.

ముస్లిం చిన్నారులకు ఖత్నా


పౌష్టికాహారం అందిస్తున్న ఫయాజ్‌బాషా, నబీరసూల్

తాడిపత్రి టౌన్: స్థానిక పుట్లూరు రోడ్డులోని టీటీడీ కళ్యాణ మండప సమీపంలోని నూర్‌బాషా దూదేకుల సేవా సంఘ కార్యాలయంలో గురువారం ముస్లిం చిన్నారులకు ఖత్నా కార్యక్రమం జరిగింది. మొత్తం 36 మందికి ఖత్నా నిర్వహించినట్లు సంఘం అధ్యక్షుడు నబీరసూల్ తెలిపారు. ఈసందర్భంగా చిన్నారులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫయాజ్ సేవా ట్రస్ట్ చైర్మన్ ఫయాజ్‌బాషా, దూదేకుల సేవా సంఘం సెక్రటరీ హుస్సేన్‌పీరా, కోశాధికారులు బాబయ్య, కుళ్లాయిప్ప, నాగపీరయ్య, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతికి పల్లెలే పట్టుకొమ్మలు


ప్రవచనం చెబుతున్న మాడుగుల నాగ గురునాథ శర్మ

పుట్లూరు: సంస్కృతికి పల్లెలే పట్టుకొమ్మలని ప్రముఖ రచయిత, అవధాని మాడుగుల నాగ గురునాథ శర్మ అన్నారు. గురువారం కొండుగారి కుంట గ్రామంలో పట్టాభి రామాలయ ప్రారంభోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాడుగుల నాగ గురునాథ శర్మ ప్రవచనాలు భక్తులను అకట్టుకున్నాయి. శ్రీరాముడి పట్టాభిషేకం జరిగిన తీరు, రామాయణం ప్రాముఖ్యత, ఈనాటి జీవనంలో శ్రీరాముడిని ఎలా ఆదర్శంగా తీసుకోవాలో వివరించారు. మన సంస్కృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. అనంతరం బ్రహ్మర్షి మాడుగుల వెంకటసుబ్రమణ్య శర్మ, మాడుగుల నాగ గురునాథ శర్మలను గ్రామపెద్దలు ఘనంగా సన్మానించారు.

ఘనంగా భద్రావతి భావనారుషీశ్వర గ్రామోత్సవం


స్వాముల ఉత్సవ విగ్రహాలను ఊరేగిస్తున్న దృశ్యం

తాడిపత్రి టౌన్ : స్థానిక యల్లనూరు రోడ్డు సమీపంలోని మార్కండేయస్వామి ఆలయంలో భద్రావతి భావనారుషీశ్వరుల కల్యాణ మహోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి అమ్మవారు,స్వామి ఉత్సవ విగ్రహాల గ్రామోత్సవం ఘనంగా జరిగింది. స్థానిక ఆలయం నుంచి సీబీరోడ్డు మీదగా యల్లనూరు రోడ్డు సర్కిల్, అంబేద్కర్ సర్కిల్, గాంధీ సర్కిల్ వరకు గ్రామోత్సవం సాగింది. ఉదయం గణపతి హోమం, క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో బహుత్తమ పద్మశాలియ సంఘం గౌరవాధ్యక్షుడు జలదుర్గం దామోదర్‌దాస్, గౌరవ సలహాదారు వద్ది లక్ష్మీనరసయ్య, ధర్మకర్త చెన్నా సూర్యనారాయణ, అధ్యక్షుడు గడ్డం గణేష్, వైస్ ప్రెసిడెంట్స్ రంగప్రసాద్, రవికుమార్, జాయింట్ సెక్రటరీ గడ్డం పరమేశ్, ప్రధాన కార్యదర్శి శంకర్, కోశాధికారి హరికృష్ణ, సభ్యులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో మాజీ కో ఆప్షన్ సభ్యుడి మృతి


యర్రగుడి గౌస్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న పామిడి వీరా

పామిడి: స్థానిక బొడ్రాయి ఏరియాలో ఉంటున్న మాజీ కోప్షన్ సభ్యుడు యర్రగుడి గౌస్(70) అనారోగ్యంతో గురువారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఏడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ ఎం వీరాంజనేయులు గౌస్ మృతదేహం వద్ద నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. నాయకులు పీటర్ విజయ్, రాజు, శివ తదితరులు ఉన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి


వివరాలు తెలియజేస్తున్న రవికిశోర్

బుక్కరాయసముద్రం: రైతులు పంటల సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలని రెడ్డిపల్లి ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ రవి కిశోర్ పేర్కొన్నారు. గురువారం రెడ్డిపల్లి ఏరువాక కేంద్రంలో రిలయన్స్ ఫౌండేషన్ ఏరువాక కేంద్రం ఆధ్వర్యంలో రైతులతో మల్టీ లొకేషన్ ఆడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రవి కిశోర్ మాట్లాడుతూ పంటలను కోసిన తరువాత పొలాల్లో తేమ ఉన్నప్పుడు వాలుకు అడ్డంగా లోదుక్కులు దున్నుకోవాలన్నారు. సాధారణంగా వేసవిలో కురిసే వర్షాలను సద్వినియోగం చేసుకుని సేద్యాలు చేసుకోవాలన్నారు. వాలుకు అడ్డంగా దుక్కి చేసుకోకపోతే నేల కోతకు గురవుతుందన్నారు. లో దుక్కులతో నీరు భూమిలోకి బాగా ఇంకిపోతుందన్నారు. రైతులు మరింత సమాచారం తెలుసుకునేందుకు రిలయన్స్ ఫౌండేషన్ వారి టోల్ ఫ్రీ నంబర్-18004198800లో సంప్రదించాలని సూచించారు.

ఆటో బోల్తా.. ఏడుగురికి గాయాలు


గాయపడిన సుంకప్ప, అభిరామ్‌ను ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

గుత్తి రూరల్: మండలంలోని కొత్తపేట గ్రామ శివారులో 67వ నంబర్ జాతీయ రహదారిపై గురువారం ఆటో అదుపు తప్పి బోల్తాపడిన ఘటనలో ఏడుగురికి గాయాలయ్యాయి. పోలీసులు, బాధితుల కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. తొండపాడు గ్రామానికి చెందిన సుంకప్ప తన మనుమరాలు మానవి కుల ధ్రువీకరణ పత్రం కోసం అభిరామ్, గంగోత్రి, లక్ష్మీదేవి, శ్రావణి, కార్తిక్‌తో కలిసి ఆటోలో గుత్తికి వచ్చారు. పని ముగించుకుని తిరిగి తొండపాడుకు వెళ్తుండగా కొత్తపేట సమీపంలో వేగంగా వెళ్తున్న ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ప్రమాదంలో గాయపడిన వారిని స్థానికులు గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు సుంకప్ప, అభిరామ్, మానవిని అనంతపురం ఆసుపత్రికి తీసుకెళ్లారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అనారోగ్యంతో వ్యాఖ్యాత మృతి

పెద్దవడుగూరు : మండలంలోని దిమ్మగుడి గ్రామానికి చెందిన ప్రముఖ వ్యాఖ్యాత మధుసూదన్‌రెడ్డి(54) గురువారం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న అభిమానులు, గ్రామస్తులు ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. రాతి దూలం లాగుడు పోటీల్లో తన గొంతుతో ఉర్రూతలూగించేవారు. మృతుడికి భార్యతో పాటు కుమార్తె ఉన్నారు.

బ్రిజ్‌భూషణ్‌పై చర్యలు తీసుకోవాలి


నిరసన తెలియజేస్తున్న నాయకులు

తాడిపత్రి టౌన్: ఢిల్లీలో జంతర్‌మంతర్ వద్ద రెజ్లింగ్ క్రీడాకారిణులు చేపడుతున్న ఆందోళనకు మద్దతుగా గురువారం స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌లో వామపక్ష పార్టీల నాయకులు నిరసన కార్యక్రమం చేపట్టారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రంగయ్య, సీపీఎం నాయకులు జగన్‌మోహన్‌రెడ్డి, రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు రాజారామిరెడ్డి, పౌరహక్కుల సంఘం జిల్లా సహాయ కార్యదర్శి శ్రీరామమూర్తి మాట్లాడుతూ బ్రిజ్‌భూషణ్‌సింగ్ లైంగికంగా వేధిస్తున్నారని మహిళ క్రీడాకారులు రోజుల తరబడి ఆందోళన చేస్తున్న కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు.

మొలక శాతం అధికంగా ఉండాలి


వేరుశనగ కాయలు పరిశీలిస్తున్న ఎఫ్‌సీఓ

శింగనమల: ఖరీఫ్‌లో రైతులకు సబ్సిడీపై అందించే వేరుశనగ కాయల్లో మొలక శాతం అధికంగా ఉండాలని ఎఫ్‌సీఓ ల్యాబ్ వ్యవసాయ అధికారి కిరణ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం లోలూరులో శ్రీసాయి విత్తనశుద్ధి కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈసందర్భంగా విత్తన నాణ్యత, మొలకలశాతం, షెల్లింగ్ శాతాన్ని పరిశీలించారు. వేరుశనగ బ్యాగు బరువు ఖచ్చితంగా ఉండాలన్నారు. అనంతరం పరిశీలన నిమిత్తం శ్యాంపిల్స్ సేకరించారు.

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

యల్లనూరు: శింగవరం గ్రామంలో శుక్రవారం మధ్యాహ్నం 3గంటలకు ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమం జరుగుతుందని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు ఈశ్వరరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు భోగతి ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. మండలస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొనాలని కోరారు.

ధర్మశాలలో యుద్ధవీరులకు నివాళి


ధర్మశాలలోని యుద్ధవీరుల స్మారక స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీ తలారి రంగయ్య

అనంతపురం క్రైం: హిమాచల్‌ప్రదేశ్ పర్యటనలో ఉన్న ఎంపీ తలారి రంగయ్య గురువారం ధర్మశాలలోని యుద్ధ వీరుల స్మారక స్థూపం వద్ద అమరవీరులకు నివాళులర్పించారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సభ్యుడిగా ఎంపీ తలారి రంగయ్య ఉన్న విషయం విదితమే.

14న హనుమాన్ రథోత్సవం

పామిడి: స్థానిక తలవాలకట్ట కోటవీధిలోని కోట వరాంజనేయస్వామి ఆలయంలో ఈనెల 14న హనుమాన్ జయంతి సందర్భంగా రథోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులకు అన్నదానం ఉంటుందన్నారు.

ఫ్యాక్షన్ గ్రామాల్లో డీఎస్పీ పర్యటన

యల్లనూరు: మండలంలోని తిమ్మంపల్లి, గొడ్డుమర్రి, కొడవండ్లపల్లి, వాసాపురంలో తాడిపత్రి డీఎస్పీ గంగయ్య గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్యాక్షన్ నాయకుల కదలికలను గమనించాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం ప్రస్తుత పరిస్థితులపై సీఐ వేణుగోపాల్‌ను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట స్పెషల్‌పార్టీ పోలీసులు ఉన్నారు.

ఉచిత కుట్టు మిషన్ శిక్షణ

అనంతపురం: రూడ్‌సెట్ సంస్థలో నిరుద్యోగ గ్రామీణ మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్ శిక్షణ, జర్దోసి జరీ మగ్గం వర్క్‌లో శిక్షణ కార్యక్రమం ఈ నెల 29 నుంచి ప్రారంభిస్తున్నట్లు రూడ్‌సెట్ సంస్థ డైరెక్టర్ లోకనాథరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఉచిత శిక్షణతో పాటు ఉచిత భోజన, వసతి సదుపాయాలు కల్పిస్తామన్నారు. 19 నుంచి 35 ఏళ్ల వయస్సు ఉన్న వారు మాత్రమే అర్హులన్నారు. 10వ తరగతి పాస్ లేదా ఫెయిల్ అయినవారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 08554-255925,9618876060, 9440905479 నంబర్లకు సంప్రదించాలని కోరారు.

నేటి నుంచి అఖండ రామభజన


నిలువెత్తు హనుమంతుడు

అనంతపురం కల్చరల్: హౌసింగ్ బోర్డు భక్తాంజనేయస్వామి ఆలయంలో మూడు రోజుల పాటు వైభవంగా హనుమద్ జయంతి వేడుకలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు పరుచూరి రమేష్ తెలిపారు. ఈ మేరకు ఆలయంలో జరిగిన సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఈనెల 12న ఉదయం 6 గంటల నుంచి 13న ఉదయం 6 గంటల వరకు అఖండ రామభజన ఉంటుందన్నారు. 13న ఉదయం 108 మంది దంపతులతో సామూహిక హనుమద్ వ్రతాలు, సాయంత్రం 1000 మందితో హనుమాన్ చాలీసా పఠనం జరుగుతాయి. 14న నిలువెత్తు మూలవిరాట్‌కు మహాపంచామృతాభిషేకాలు, మహా సుదర్శన హోమం, పూర్ణాహుతి జరుగుతాయని తెలిపారు.

కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందించుకోవాలి

పామిడి: విద్యార్థులు కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందించుకోవాలని వ్యక్తిత్వ వికాస నిపుణుడు లీలా మనోహర్ అన్నారు. గురువారం గ్రంథాలయాధికారి సీ వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరానికి హాజరై ఆయన మాట్లాడారు. వ్యక్తిత్వ వికాసం ప్రాముఖ్యత గురించి వివరించారు. విద్యార్థులకు జీవనశైలి, జీవన నైపుణ్యాల గురించి దిశా నిర్దేశం చేశారు.

ఆర్బీకేల్లో పేర్లు నమోదు చేసుకోండి

పుట్లూరు: వేరుశనగ విత్తన కాయల కోసం ఈ నెల 15 నుంచి రైతు భరోసా కేంద్రాల్లో రైతులు తమ పేర్లను నమోదు(రిజిస్ట్రేషన్) చేయించుకోవాలని ఏఓ కాత్యాయని గురువారం తెలిపారు. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి పుట్లూరు మండలానికి 300 క్వింటాళ్ల వేరుశనగ (కే-6 రకం) కేటాయించారన్నారు. రైతులు 40 శాతం సబ్సీడీతో బస్తా (30 కేజీలు) రూ.1,674లతో పొందవచ్చని తెలిపారు. ఇదిలా ఉండగా రబీలో సాగు చే సిన మొక్కజొన్నల కొనుగోలు కోసం రైతులు తమ పేర్లను ఆర్బీకేల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. క్వింటాల్ మొక్కజొన్న రూ.1,962ల ప్రకారం రైతుల నుంచి సొసైటీ వారు కొనుగోలు చేస్తారన్నారు. ఈ నెల 12లోగా రైతులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు.

గుంతకల్లు: వేరుశనగ విత్తనాల కోసం రైతులు ఆర్‌బీకేల్లో పేర్లు నమోదు చేసుకోవాలని ఏఓ కే.స్వాతి సూచించారు. గురువారం స్థానిక ఆర్‌బీకే సెంటర్‌లో మండల ఆర్‌బీకే సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 15 నుంచి ఆర్బీకేల్లో వేరుశనగ విత్తనాల కోసం రైతులు పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. కే6 3,500 క్వింటాళ్లు, లేపాక్షి వేరుశనగ రకం 100 క్వింటాళ్లు మండలానికి కేటాయించినట్లు తెలిపారు. ఇక పీఎం కిసాన్, ఈ-కేవైసీ, ఎన్‌పీసీఐ, ఈ- క్రాప్ బుకింగ్‌పై తదితర అంశాలపై రైతులకు తెలియజేయాలన్నారు.